పరిశుభ్రంగా డంపింగ్ యార్డ్

ఎప్పటికప్పుడు చెత్త తరలింపు



డంపింగ్ యార్డ్‌ను శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్



క్లీన్‌గా ఉన్న డంపింగ్ యార్డ్

పెదగంట్యాడ: డంపింగ్ యార్డ్ క్లీన్‌గా మారింది.. ఎప్పటికప్పుడు ఇక్కడి చెత్తను తరలించడంతో పరిశుభ్రంగా కనిపిస్తోంది. జీవీఎంసీ ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ దగ్గరుండి మరీ దీనిని శుభ్రం చేయిస్తున్నారు.

జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్‌కు ఆనుకుని ఉన్న ఈ డంపింగ్ యార్డ్‌లో చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోయేది. జీవీఎంసీ జోన్–6 పరిధిలోని పలు వార్డుల నుంచి సేకరించిన చెత్తను ఇక్కడ డంప్ చేస్తారు. దీంతో ప్రతి రోజూ టన్నుల కొద్దీ చెత్త ఇక్కడ నిల్వ ఉండేది. ఇక్కడి నుంచి ఎప్పటికప్పుడు చెత్తను తరలించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో కొండలా పేరుకుపోయేది. విపరీతంగా దుర్వాసన రావడంతో డంపింగ్ యార్డ్ సమీపంలోని పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో 16 గ్రామాలకు చెందిన ప్రజలు డంపింగ్ యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి కూడా పరిస్థితిని వివరించారు. డంపింగ్ యార్డ్‌ను తరలించేలా చూడాలని విన్నవించారు. ఈ పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ నడుం బిగించారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. అలాగే, ఇక్కడి చెత్తను పూర్తి స్థాయిలో తరలించేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పనులు జోరుగా చేపట్టారు. ఇక్కడ గుట్టలుగా ఉన్న చెత్తాచెదారాన్ని పూర్తిగా తరలించారు. అక్కడ అసలు చెత్త లేకుండా మొత్తం శుభ్రం చేయించారు. ఇప్పుడు ఈ డంపింగ్ యార్డ్ క్లీన్‌గా కనిపించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ ఇదే మాదిరిగా శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దాతలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. బండారు విజయనగర్ శ్రీనివాస్, విజయవర్ధిని కుమారుడు బండారు కిశోర్‌బాబు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల, పెంటకోట పైడిరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్ట్‌ఫర్నేస్ నూతన విభాగాధిపతికి అభినందన



భట్టాచార్యను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె. భట్టాచార్యను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. శనివారం ఆయన్ను కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎఫ్–3లో వెంటనే ఉత్పత్తిని ప్రారంభించి, పూర్తి స్థాయిలో చేపట్టాలని కోరారు. నూతన విభాగాధిపతి మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపునకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప, నాయకులు మార్టుపూడి పరదేశి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, పిట్టారెడ్డి, అండిబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి గంగవరం పోర్టు సీఎస్సార్ నిధులు



జెడ్సీ సింహాచలానికి చెక్కు అందిస్తున్న గంగవరం పోర్టు అధికారి వసంత్‌కుమార్

పెదగంట్యాడ/గాజువాక : గంగవరం గ్రామంలో జీవీఎంసీ కమ్యూనిటీ టాయిలెట్స్, శానిటేషన్ నిర్వహణకు అదానీ ఫౌండేషన్, గంగవరం పోర్టు తమ సీఎస్సార్ నిధుల నుంచి రూ.6.60లక్షలను కేటాయించింది. దీనికి సంబంధించిన డీడీని పోర్టు కార్పొరేట్ వ్యవహారాల ముఖ్య అధికారి వి.వసంత్‌కుమార్, పోర్టు అధికారి అచ్యుతరావు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేవీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్



యారాడ బీచ్‌లో తొలగించిన చెత్తతో నేవీ అధికారులు

పెదగంట్యాడ: తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తూర్పు నావికాదళ అధికారులు తెలిపారు. పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యారాడ, భీమిలి, ఆర్కే బీచ్‌లతో పాటు మేఘాద్రిపేట నదీ పరివాహక ప్రాంతంలో శనివారం చెత్తాచెదారాన్ని తొలగించారు. అన్ని ప్రాంతాల్లో కలిపి మొత్తం 450 కిలోల చెత్తను ఏరివేశారు. కోస్టల్ క్లీనప్ కింద ప్రతి నెలా ఒక రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నావికాదళానికి చెందిన 550కి పైగా సర్వీస్, డీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వేతనాల కోసం మోకాళ్లపై నిరసన



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు నూతన వేతనాల కోసం మోకాళ్లపై నిరసన తెలిపారు. సెయిల్‌లో ఉక్కు కార్మికులకు సంవత్సరంన్నర నుంచి నూతన వేతనాలు అమలు చేయగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులకు ఇంతవరకు అమలు చేయలేదు. దీంతో కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తున్నా, యాజమాన్యం నుంచి స్పందన కనిపించకపోవడంతో యువ కార్మికులు ఆందోళనలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వెంటనే నూతన వేతనాలు అమలు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని మోకాళ్లపై కూర్చుని డిమాండ్ చేశారు. యాజమాన్యం నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యువ కార్మికులు కోరాడ వెంకటరావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్, రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేట్ ఎలక్ట్రీషియన్‌లో 90 సీట్లు ఉన్నాయని, పదో తరగతి, ఐటీఐ ఆపైన పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్లంబర్ జనరల్‌లో 8వ తరగతి, ఐటీఐ ఆపైన పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అసోసియేట్ మేసన్ కోర్సులో 60 సీట్లు ఉన్నాయని, ఐదో తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. పెదగంట్యాడలోని తమ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టేషనరీని ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంబంధిత రంగంలో (ప్రైవేట్ సెక్టార్లలో) ఉపాధి కల్పిస్తామని, శిక్షణ కోసం ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ కార్యాలయంలో గానీ లేదా 83090 03957, 91332 42666, 94903 91324 నంబర్ల ద్వారా ఫోన్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

రోగి ఇంటికి వెళ్లి వైద్యపరీక్షలు

69వ వార్డులో ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వైద్యసేవలు



మంచానికే పరిమితమైన వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్ పద్మ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెం సచివాలయ పరిధిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.పద్మ పీహెచ్‌సీ వద్ద స్థానిక ప్రజలకు వైద్యసేవలందించి, ఉచితంగా మందులు అందించారు. అనంతరం దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులను అందించారు. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొంది, డిశ్చార్జి అయిన రోగుల ఇంటికి వెళ్లి వైద్యసేవలు చేశారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎస్.రాజు, సచివాలయ హెల్త్ సెక్రటరీ సుధ, ఆరోగ్య పర్యవేక్షకులు కిషోర్ కుమార్, షమీ, అశోక్, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



రవిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న ఆధ్వర్యంలో నాయకులు ఆయన్ను శనివారం కలిసి, ఉద్యోగుల సమస్యలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ, డి. పుల్లారావు, ఎస్. మోహన్‌బాబు, కె.వి. రత్నం తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం తప్పనిసరి



ఎన్‌వీపీ న్యాయ కళాశాల విద్యార్థులతో శ్రీనివాసరావు తదితరులు

విశాఖ, లీగల్ : న్యాయ విద్యార్థులకు నిరంతర అధ్యయనం అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం నగరంలోని వివిధ న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో న్యాయమూర్తి వివిధ అంశాలపై ముచ్చటించారు. న్యాయవాదులు ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలతో పాటు కోర్టుల్లో కేసుల విచారణ, సీనియర్ న్యాయవాదుల వాదనలు విని ఆకళింపు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలల్లో నేర్చుకున్న అంశాలను, న్యాయస్థానాల్లో తీర్పులు, సీనియర్ల వాదనలు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను అన్వయించే విధానాలను గ్రహించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు, ఉచిత న్యాయ సహాయం, సంబంధిత చట్టాలను వివరించారు.

యథేచ్ఛగా పశువుల సంచారం

- రోడ్డుపై రాకపోకలకు ఆటంకం
- నివాస ప్రాంతాలు అపరిశుభ్రం
- యజమానుల ఇష్టారాజ్యం
- అధికారుల చర్యలు నామమాత్రం



వడ్లపూడిలో ఆవును బంధించి తీసుకెళ్తున్న జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది



గాజువాక మెయిన్ రోడ్‌లో రాకపోకలకు అడ్డంగా ఉన్న పశువులు

గాజువాక : గాజువాక, పరిసర ప్రాంతాల్లో పశు సంచారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులైనా, జనం నివాసముండే ప్రాంతాలైనా ఎక్కడికక్కడ వాటి సంచారం విపరీతంగా పెరిగిపోయింది. గాజువాక జోన్‌లో ప్రతి కాలనీ నుంచి పశువుల సంచారంపై ఫిర్యాదులు పెరుగుతూనే ఉన్నాయి.

మెయిన్ రోడ్డులో ఇబ్బందికరం

ఇసుకేస్తే రాలనంతగా జనం రద్దీతో నిండిపోయే గాజువాక మెయిన్ రోడ్‌లో వాహనాల వేగ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు నిరోధకాలను ఏర్పాటు చేయడం కొంత ఇబ్బందికరమే. రద్దీ వల్ల నడిచి వెళ్లడానికి కూడా ఖాళీ ఉండని ఈ రోడ్‌లో పశువులు సైతం వాహనాల రాకపోకలను నిరోధిస్తుంటాయి. పశువులు అడ్డు రావడంతో వాహనాలపై నుంచి కిందపడిపోతున్న కేసులూ అధికంగానే ఉంటున్నాయి.

నివాస ప్రాంతాల్లోనూ ఇదే సమస్య చోటుచేసుకుంటోంది. ప్రతి వీధిలోను పశువుల సంచారం పెరిగిపోయింది. పందులు, కుక్కలతో ఇబ్బంది పడుతున్న నివాసులకు పశువులతోను అవస్థలు పడాల్సి వస్తోంది. పశువుల యజమానులు ఉదయాన్నే వాటిని యథేచ్ఛగా విడిచిపెడుతున్నారు. దీంతో అవి ఎక్కడపడితే అక్కడ, ఇళ్లముందు పేడ వేసి మూత్ర విసర్జన చేస్తున్నాయి. ఈ సమస్యపై ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత సిబ్బంది స్పందన నామమాత్రంగానే ఉంటోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

నివాస ప్రాంతాల్లో పశువుల సంచారం నియంత్రణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నాం. ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి, వాటిని ఆరిలోవలోని జీవీఎంసీ పశువుల సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నాం. పశువుల యజమానులకు అపరాధ రుసుం విధిస్తున్నాం. ఈ విషయంలో ప్రజలు కూడా సహకరించాలి. చెత్తను రోడ్లపై వేస్తుండటం వల్ల ఆవులు, గేదెలు వస్తున్నాయి. చెత్తను చెత్త సేకరణ వాహనాలకు అందిస్తే ఈ సమస్య కొంత తగ్గుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే ఉన్నాం. మరోపక్క పశువుల యజమానులను కూడా హెచ్చరిస్తున్నాం.

– డాక్టర్ కిరణ్ కుమార్, సహాయ ప్రజారోగ్యాధికారి, జీవీఎంసీ గాజువాక జోన్

ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ



పెందుర్తి భవిత కేంద్రంలో నిర్వహించిన వైద్యశిబిరం

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తగిన శ్రద్ధ తీసుకుంటున్నట్లు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ అబ్దుల్ ఆషా తెలిపారు. జిల్లాలోని అన్ని భవిత కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. వైకల్యం గల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలను సైతం అందిస్తున్నామన్నారు. పెందుర్తి భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో చదువుతో ఆరోగ్య పరమైన సేవలు అందిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



జస్టిస్ శేషసాయికి స్వాగతం పలుకుతున్న నరసింగరావు

విశాఖ లీగల్: న్యాయసేవ ప్రాధికార సంస్థ, ఉచిత న్యాయ సేవలు, చట్టాలపై న్యాయవాదులు, ప్రజలకు అవగాహన అవసరమని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, లోక్ అదాలత్ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ ఆకుల శేషసాయి అన్నారు. శనివారం ఆయన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నరసింగరావు, మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి ఎం.రమణారావు, లోక్ అదాలత్ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు న్యాయమూర్తితో పలు అంశాలపై చర్చించారు. గత ఏడేళ్లలో ఆరు వేల మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వచ్చే రోజుల్లో మరిన్ని శిక్షణ తరగతులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని న్యాయమూర్తి సూచించారు.

కాలుష్య తీవ్రత పరిశీలన

- శాంపిల్స్ సేకరించిన పీసీబీ అధికారులు



కాలుష్యాన్ని గుర్తించేందుకు అమర్చిన మిషన్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి డెయిరీ కాలనీలో కాలుష్య తీవ్రతను పరిశీలించేందుకు అధికారులు మిషన్లను ఏర్పాటు చేశారు. గంగవరం పోర్టు కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నామంటూ డెయిరీ కాలనీ, ఎల్ఐజీ–2 హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దుమ్ము, ధూళి కారణంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, నల్లని బుగ్గి ఇళ్లలోకి, కళ్లలోకి చేరుతోందని వివరిస్తూ పెద్ద ఎత్తున వినతులు సమర్పించారు. దీనిపై స్పందించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఇక్కడ కాలుష్య తీవ్రతను గుర్తించేందుకు శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకూ మిషన్లు ఏర్పాటు చేసి పరిశీలించారు. రెండు చోట్ల యంత్రాలను బిగించి, శాంపిల్స్ సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపించి, తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంకేఎస్ మూర్తి, పెంటకోట సతీష్, వేణు, యండా కృష్ణ, శేఖర్, చిరంజీవి, మన్మథరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకు భంగం కలిగితే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: కార్మిక హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటివ్ చెల్లించకపోవడం, ఎల్‌టీసీ నిలుపుదల చేయడం వంటి కారణాల వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అదే విధంగా అన్ని విభాగాల్లో కార్మికులు పదవీ విరమణ చేయడం, మృతి చెందడం వల్ల సిబ్బంది తగ్గిపోతున్నారని తెలిపారు. వెంటనే యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, బీఎంకె నాయక్, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ ఉద్యమాలు కొనసాగుతాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 765వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఉక్కు కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక, ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టి ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

త్వరితగతిన నగర సుందరీకరణ పనులు

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం



రైల్వే స్టేషన్ రోడ్డులో సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శనివారం షీలానగర్, ఎయిర్‌పోర్ట్, ఎన్ఏడీ జంక్షన్, మర్రిపాలెం, మురళీనగర్, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీ20 సదస్సుకు ఎంతో మంది దేశ విదేశీ ప్రతినిధులు వస్తున్నందున, వారికి ఆహ్లాదం కలిగించేలా నగర సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన మార్గంలోని బారికేడ్ల వద్ద వినియోగంలో లేని కేబుల్ వైర్లు తొలగించాలని, అవసరమైన వైర్లను క్రమబద్ధీకరించాలని, అనుమతి లేని ప్రకటన బోర్డులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైలింగ్‌కు పెయింటింగ్ రెండో సారి వేయాలని, సెంట్రల్ మీడియన్‌లో మొక్కలు, వాటి మధ్య ఖాళీలు అక్కడక్కడ ఉన్నాయని, ఆ ప్రాంతంలో కొత్తవి నాటాలన్నారు. పాత సూచిక బోర్డులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, బస్ షెల్టర్లను ఆధునికీకరించాలని, మొక్కలను ట్రిమ్ చేస్తూ, ప్రధాన రహదారి పొడుగునా ఉన్న ప్రతి మొక్కకు రోజూ నీరు పోయాలన్నారు. మర్రిపాలెంలోని 24/7 తాగునీటి ప్రాజెక్టును పరిశీలించేందుకు అతిథులు ఆ ప్రాంతాన్నిసందర్శిస్తారని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిత్యం మనం ప్రజలకు తాగునీరు ఏ విధంగా అందిస్తున్నామో తెలియజేయాలన్నారు. మాధవధార రిజర్వాయర్, దాని చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అందంగా మార్చాలని ఆదేశించారు. పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, హార్టికల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, సింహాచలం, మల్లయ్యానాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ కె.వేణుగోపాలరావు, డీసీపీ సంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులుకు చెక్కు అందజేస్తున్న దాత రమణారెడ్డి



పీఆర్వో సునీల్‌కు చెక్కు అందజేస్తున్న దాత చైతన్య కృష్ణతేజ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని ఆర్కే బీచ్ ప్రాంతానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే దాత లక్షా 1116లు విరాళంగా ఇచ్చారు. ఆలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు సంబంధిత చెక్కు అందజేశారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన చైతన్య కృష్ణతేజ అనే దాత రూ. లక్ష విరాళాన్ని సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో పీఆర్వో సునీల్‌కు చెక్కురూపంలో అందజేశారు. దాతలకు స్వామి దర్శనం కల్పించారు.